క్లుప్తంగా

అప్రమత్తత తప్పనిసరి

శృంగవరపుకోట: ప్రాణాంతకమైన డెంగీపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రత పాటిస్తామని విద్యార్థులచే సీహెచ్‌ఓ వేణుగోపాల్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు

- ఎంఈఓ విమలమ్మ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం రూరల్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి విమలమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు నమ్మకం కలిగేలా విద్యాబోధన చేపట్టాలన్నారు. చదువు మానేసిన పిల్లలచే ఓపెన్ టెన్త్ చేయించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం మెనూ పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ – 2 చక్రధర్‌తో పాటు సీఆర్పీలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందకు నివాళులు

శృంగవరపుకోట: పట్టణంలో వివేకానంద జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వామి రచనలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీవీ కృష్ణమూర్తి, శీలా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సోంపురం కార్యదర్శిగా కృష్ణారావు


బాధ్యతలు స్వీకరించిన కృష్ణారావు

వేపాడ: మండలంలోని సోంపురం పంచాయితీ కార్యదర్శిగా విశ్వనాథం కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్తవలస మండలంలో దేశపాత్రుని పాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన కృష్ణారావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో వేపాడ మండలంలో పనిచేసిన అనుభవం ఉన్నందున ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.

అవగాహన సదస్సు

కొత్తవలస: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తణికీ ఐఈసీపై (ఇన్‌ఫర్మేషన్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) మండలంలోని కంటకాపల్లి గ్రామంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గుతో గ్రామ చిత్రపటాన్ని వేశారు. అనంతరం స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్‌పీ) ఎం.గోవిందరావు మాట్లాడుతూ.. ఎంపిక చేసిన పనులు, వేతనాలు, తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఏపీఓ జనార్దనరావు, డీఆర్‌పీలు ఎ.నరేష్, వై.శ్రీను, ఆర్.రమేష్, పలువురు ఉపాధి వేతన దారులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

చీపురుపల్లి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్.మాధవ్‌ను చీపురుపల్లి నియోజకవర్గ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తాజాగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాధవ్‌ను శుక్రవారం విశాఖపట్టణంలో కలిసిన వారు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో నాయకులు ఎస్‌వీఎల్ఎన్.రాజు, ఇప్పిలి నీలకంఠం, ఇమంది వెంకటరావు, అప్పారావు, విద్యాసాగర్, వెంకటరావు, రామునాయుడు, త్రినాథ్, నాగమల్లిక, తదితరులు ఉన్నారు.

అభినందనలు

గజపతినగరం: జాతీయ కౌన్సిల్ మెంబర్‌గా నియమితులైన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావనిని బీజేపీ మండలాధ్యక్షుడు ఎం.భాస్కర్‌తో పాటు పలువురు నేతలు దొగ్గ దేవుడుబాబు, రామకృష్ణ, సత్యనారాయణ, తదితరులు శుక్రవారం కలిసి అభినందనలు తెలియజేశారు. మరుపల్లిలోని ఆమె స్వగృహంలో పావనిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఏడుకొండలు, మహేష్, మజ్జి రమేష్, తవుడు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా పాలన

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట: అభివృద్ధి చెందిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపేందుకు కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వర్ణాంధ్ర విజన్ – 2047 కార్యక్రమంపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిని ప్రపంచస్థాయిలో గొప్ప నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారని చెప్పారు. మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ప్రత్యేకాధికారి ఇ.మురళి, ఎంపీడీఓ సతీష్‌తో పాటూ ఐదు మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

క్షీణిస్తున్న పారిశుధ్యం..


మంగళపాలెం గ్రామ సమీపంలో రోడ్డుపైనే నిల్వ ఉన్న చెత్త

- చెత్తశుద్ధి కేంద్రాలకు తరలని చెత్త
- స్వైరవిహారం చేస్తున్న పందులు
- పట్టించుకోని అధికారులు

కొత్తవలస: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టిన దాఖలాలే కనిపించడం లేదు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సేకరించిన చెత్త ఆయా గ్రామాల పరిధిలో గల చెత్తశుద్ధి కేంద్రాలకు చేరడం లేదు. కొన్ని గ్రామాల్లో అసలు ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో సేకరించిన చెత్తను రోడ్డు పక్కన, గ్రామానికి సమీపంలో పడేస్తున్నారు. దీంతో చెత్తశుద్ధి కేంద్రాలు అలంకారప్రాయంగానే మిగిలిపోతున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గ్రామాల్లో మురుగు, చెత్త పేరుకుపోతోంది. అధికారులు మాత్రం తూతూమంత్రంగానే నిర్వహణ పనులు చేపడుతున్నారు.


కొత్తవలస హైస్కూల్ సమీపంలో చెత్త కుప్పల వద్ద స్వైరవిహారం చేస్తున్న పందులు

నీరుగారుతున్న లక్ష్యం..

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 15 రోజుల పాటు పారిశుధ్య నిర్వహణ పనుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని జిల్లా అధికారులు హడావిడిగా పర్యటిస్తూ పరిశీలిస్తున్నారు. వాస్తవానికి గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. అధికారుల హడావిడి మాత్రం ఎక్కువగా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

మరీ దారుణం..

గ్రామంలో పారిశుధ్యం బాగా క్షీణించింది. ఎక్కడబడితే అక్కడే చెత్తా చెదారాలు పేరుకుపోవడం.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికే చాలా మంది జ్వరాలతో బాధపడుతున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి.
– ఎం.అప్పారావు, మంగళపాలెం

ప్రబలుతున్న రోగాలు..

ఎక్కడబడితే అక్కడ పేరుకుపోయిన చెత్తల వద్ద పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో రోగాలు ప్రబలే అవకాశం ఉందని మంగళపాలెం, కొత్తవలస, దెందేరు, గులివిందాడ, బలిఘట్టాం, తదితర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పందుల నివారణకు అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదని మండల వాసులు బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల స్థాయి అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు


ఎస్‌డబ్ల్యూపీసీలో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ సురేష్, సిబ్బంది

చీపురుపల్లి: పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్ తెలిపారు. స్థానిక మేజర్ పంచాయతీలోని లావేరు రోడ్‌లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద బోరు, మోటారు, విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మేజర్ పంచాయతీలోని వార్డుల్లో సేకరించే తడి, పొడి చెత్తలను ఎస్‌డబ్ల్యూపీసీలకు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఇక్కడి కేంద్రంలో తడి, పొడి చెత్తలను వేరు చేసి వర్మీ కంపోస్టు తయారు చేసి, వాటి విక్రయం ద్వారా ఆదాయం సముపార్జించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ పి.రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

భజగోవిందం కార్యక్రమానికి తరలిరండి

- సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ శీరంరెడ్డి చంద్రశేఖర్

గజపతినగరం: ప్రముఖ పుణ్యక్షేత్రం సింహాచలంలో శనివారం నిర్వహించనున్న భజగోవిందం కార్యక్రమానికి భక్తులు తరలిరావాలని సాయిసిద్ధార్థ కళాశాల కరస్పాండెంట్ శీరంరెడ్డి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో 2010 మార్చి 16న కీర్తిశేషులు డాక్టర్ వడలి సూర్యనారాయణమూర్తి, కామేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం వేదపండితుడు వేదుల భువనేశ్వరశర్మ పర్యవేక్షణలో భజగోవిందం కార్యక్రమం గజపతినగరంలోని సీతారామ స్వామి ఆలయంలో ప్రారంభించామన్నారు. నేటి వరకు ప్రతి శనివారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 800వ కార్యక్రమం అంగరంగ వైభవంగా సింహాచలంలో నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

11న మండల సర్వసభ్య సమావేశం

కొత్తవలస: ఈ నెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షురాలు నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన జరగనున్న సభకు మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు. గత సభలో తెలియజేసిన సమస్యలపై తీసుకున్న పరిష్కార నివేదికలతో పాటు శాఖల వారీగా అభివృద్ధి నివేదికలతో అధికారులు హాజరుకావాలని పేర్కొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

గజపతినగరం రూరల్: ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం జాతీయ మెగా లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ విజయ్ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇరుపార్టీల అనుమతులతో క్రిమినల్, మోటార్ ప్రమాద కేసులు, బీమా, బ్యాంక్ కేసులు, చెక్‌బౌన్స్, ప్రాంశరీ నోటులు, ఎక్సైజ్ కేసులు, భూ తగాదాలు, కుటుంబ తగాదాలను రాజీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

సర్వేయర్‌గా రామ్‌కుమార్..

దత్తిరాజేరు: మండల సర్వేయర్‌గా ఎం. రామ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించినట్లు తహసీల్దార్ విజయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన సుబ్బారావుకు గజపతినగరం బదిలీ కావడంతో ఆయన స్థానంలో కలెక్టరేట్ నుంచి రామ్‌కుమార్ వచ్చారని పేర్కొన్నారు.

బదిలీపై అధికారుల రాక..

మెరకముడిదాం: మండలానికి పలువురు అధికారులు బదిలీపై వచ్చారు. మండల సర్వేయరుగా తమ్మన్నస్వామి.. విజయనగరం సర్వే జేడీ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్ బదిలీపై వచ్చారు. ఆర్ఐగా చీపురుపల్లి మండలం నుంచి డి.రామ్‌కుమార్ బదిలీపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

జిందాల్ నిర్వాసితుల అర్ధనగ్న ప్రదర్శన


బొడ్డవరలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: తాటిపూడి నీరు రైతుల సొంతమని.. తాగునీరు, సాగునీరు అవసరాలకే జలాశయం నీటిని వినియోగిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటన చేయాలని జిందాల్ నిర్వాసిత రైతులు, ఏపీ రైతు సంఘ నాయకుడు చల్లా జగన్, తదితరులు డిమాండ్ చేశారు. ఈమేరకు బొడ్డవరలో శుక్రవారం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాటిపూడి నీరు విడుదలకు వచ్చిన మంత్రి తాటిపూడి నీరు రైతులకే సొంతమన్నారని చెప్పారు. ఆ తర్వాత జీఓ 14 ద్వారా తాటిపూడి నీటిని జిందాల్‌కు మళ్లించేందుకు అనుమతులివ్వడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. తాటిపూడి నీరు పూర్తిగా ఈ ప్రాంత ప్రజల తాగు,సాగునీటి అవసరాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. స్థానిక పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పోలీసులు ప్రజలను పక్కన పెట్టి, జిందాల్‌కు కొమ్ముకాయటం సరికాదన్నారు.

మామిడి రైతులకు న్యాయం చేయాలి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణరావు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణారావు, తదితరులు

మెరకముడిదాం: కూటమి ప్రభుత్వం మామిడి పంటకు గిట్టుబధర కల్పించకపోవడంతో చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రేగిడి లక్ష్మణరావు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న మామిడి రైతులకు చేదోడుగా ఉండాల్సిన ప్రభుత్వం వారిని కనీసం పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర స్థాయిలో నష్టపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మామిడి రైతుల ఇబ్బందులను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ, సీతారామ్, కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరుతో ప్రభుత్వం అందజేస్తున్న కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు అన్నారు. గరివిడి మండలంలోని గెడ్డపువలస పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సూరినాయుడు, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ శిరీష, కె.రమణ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


యూనిఫాం,బ్యాగులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పేరిపిలో..

చీపురుపల్లి: మండలంలోని పేరిపి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ మోపాడ కుమారి చేతులు మీదుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎ.సుధారాణి, ఉపాధ్యాయులు మీసాల శ్రీనివాసరావు, ఎంఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


చీపురుపల్లి: విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

విద్యాబోధన మరింత మెరుగుపడాలి

- ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


స్టూడెంట్స్ కిట్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: ప్రస్తుతం విద్యార్థులకు బోధిస్తున్న తీరు మరింత మెరుగుపడాల్సి ఉందని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు డాక్టర సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్‌లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కొల్లు రమణమూర్తి, కొట్యాడ ఈశ్వరరావు, ఎంఈఓలు కూర్మారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

చీపురుపల్లి: పట్టణంలోని రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఎనిమిది మంది ఉపాధ్యాయులను శుక్రవారం స్థానిక పాఠశాల ఆవరణలో సత్కరించారు. హెచ్‌ఎం కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంది గోపి, పి.తిరుపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాశ్వత మెంబర్‌గా ఎమ్మెల్యే కోళ్ల..

లక్కవరపుకోట: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శాశ్వత సభ్యురాలిగా స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి నియమితులయ్యారు. సొసైటీ ఎస్.కోట బ్రాంచ్ చైర్‌పర్సన్ డాక్టర్ పి. వరలక్ష్మి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యేతో పాటు మరో 40ని శాశ్వత సభ్యులుగా శుక్రవారం చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సొసైటీ చేపట్టిన అన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఎ.మల్లేశ్వరరావు, కోశాధికారి వెంకన్నబాబు, జిల్లా మేనేజ్‌మెంట్ మెంబర్ దొడ్డి సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

శృంగవరపుకోట: ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట కేజీ నాయుడు అధ్యక్షతన పలువురు ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ రీజనల్ కార్యదర్శి జి.రవికాంత్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు వెంటనే ఇవ్వాలని, ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 10 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 12వ పీఆర్‌సీ నియమించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు కేకే రావు, ఎస్‌ఏ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి


లక్కవరపుకోట: ఎంఈఓ కూర్మారావుకి వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజనం నిర్వాహకులు


కొత్తవలస: ఎంఈఓ శ్రీదేవికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, మధ్యాహ్న భోజనం నిర్వాహకులు

లక్కవరపుకోట/కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజనం పథకం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తరణి, వెంకటరమణ కోరారు. ఈ మేరకు పలువురు నిర్వాహకులతో కలిసి లక్కవరపుకోట, కొత్తవలస మండలాల ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, జి.శ్రీదేవిలను శుక్రవారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం నిర్వాహకులను కార్మికులుగా గుర్తించడంతో పాటు మెనూ చార్జీలను పెంచాలని కోరారు. రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. అలాగే ఈ నెల 9న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో నిర్వాహకులు పాల్గొంటారని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పలువురు మధ్యాహ్న భోజనం నిర్వాహకులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు..


ఎస్.కోట: ర్యాలీ చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉపన్యాసకులు, విద్యార్థులు


కొత్తవలస: అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, తదితరులు

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉపన్యాసకులు మన్యం వీరుడు, స్వాతంత్రోద్యమ విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు 128వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించి నివాళులు అర్పించారు. అల్లూరి చిత్రపటంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ.. బ్రిటిష్ పాలకులపై తిరుగుబాటు చేసి దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన రామరాజు తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేశాడన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, ఉపన్యాసకులు పాల్గొన్నారు.


వేపాడ: బొద్దాం హైస్కూల్‌లో అల్లూరికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో..

కొత్తవలస: మండల కేంద్రంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహానికి క్షత్రియ సేవా సమితి ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ పి. అప్పలరాజు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరి పోసింది అల్లూరి సీతారామరాజని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణయ్య, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, క్షత్రియ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గోపిరాజు, శ్రీనివాసవర్మ, తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో...

వేపాడ: మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మన్యం వీరుడు, విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు. పాఠశాల ఆవరణలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు హాజరయ్యారు.

శాకంబరిగా దుర్గాభవానీ..

కొత్తవలస: మండల కేంద్రంలో విశాఖపట్నం రోడ్డులో గల దుర్గాదేవి అమ్మవారు శాకంబరీ దేవిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. పురోహితుడు లక్ష్మీశ్రీనివాసశర్మ అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


కొత్తవలస: పూజలందుకుంటున్న శాకంబరీ దేవి


జామి: శాకంబరి మాతగా అమ్మవారు

ప్రత్యేక పూజలు..

జామి: మండలంలోని అలమండ విజయదుర్గ ఆలయంలో ఆషాఢమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారు శాకంబరీ దేవిగా దర్శనమిచ్చారు. అర్చకుడు శర్మ ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్యకు కృతజ్ఞతలు తెలియజేస్తున్న వాణి, మహేష్ దంపతులు

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ సంయుక్త కార్యదర్శిగా బుడతానపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ అలమండ వాణి నియమితులయ్యారు. దీంతో వాణి,మహేష్ దంపతులు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను విజయనగరంలోని ఆయన స్వగృహంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పీరుబండి హైమావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, బుడతానపల్లి ఎంపీటీసీ సభ్యురాలు వర్రి అర్జునమ్మ, వర్రి మల్లునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొండగంగుబూడిలో పంటకోత ప్రయోగం


కేజీపూడిలో పంటకోత ప్రయోగంలో పాల్గొన్న రైతులు, సిబ్బంది

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో నువ్వు సాగులో ట్రైనర్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంటకోత ప్రయోగం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నువ్వులో అంతర పంటగా కూరగాయలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం వస్తుందని చెప్పారు. 5/5 విస్తీర్ణంలో పంటకోత ప్రయోగం చేపట్టడగా 50 కిలోల దిగుబడి వచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ వీరభద్రస్వామి, పెంటయ్య, మల్లేష్ నాయుడు, ఐసీఆర్‌పీలు రైతులు పాల్గొన్నారు.